



దమ్మపేట మండలం వడ్లగూడెంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చిత్రంలో మంత్రి పొంగులేటి, అభ్యర్థి రఘురాంరెడ్డి

రఘురాంరెడ్డి గెలుపు ఘనంగా ఉండాలి

- అప్పుడే మా విలువ మరింత పెరుగుతుంది
- మతం పేరుతో బీజేపీ విచ్ఛిన్నకర రాజకీయాలు
- ఓట్ల కోసం అబద్ధాలు ప్రచారం చేస్తున్న కేసీఆర్ : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణ నెంబర్‌వన్ : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అశ్వారావుపేట/దమ్మపేట, ఏప్రిల్ 26: కాంగ్రెస్ ప్రభుత్వం ఖమ్మం జిల్లాకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చి ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చిందని, ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించడం ద్వారా తమ విలువను మరింత పెంచేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. దమ్మపేట మండలంలోని వడ్లగూడెం సమీపంలో శుక్రవారం రాత్రి నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ సుదీర్ఘకాలంపాటు కాంగ్రెస్‌తో అనుబంధం, రాజకీయ నేపథ్యం కలిగిన రఘురాంరెడ్డికి ఓట్లు వేసి గెలిపించడం ద్వారా కేంద్రంలో రాహుల్ గాంధీని ప్రధాని చేయాలనే లక్ష్యంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కులం, మతం పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేసి, విభజించి మళ్లీ అధికారంలోకి రావాలని బీజేపీ ప్రయత్నిస్తోందని, ఇప్పటికే జరిగిన ఎన్నికల్లో ఇండియా కూటమిదే ఆధిక్యత కనిపిస్తుండటంతో ప్రధాని సైతం దిగజారి వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు.

పదేళ్ల తెలంగాణను దోచి, రూ.కోట్లు దాచుకోవడం కోసం మళ్లీ అధికారం కావాలంటూ మాజీ సీఎం కేసీఆర్ 'నేను దిగిపోయాను కరెంటు పోయింది..' అని చెపుతూ ప్రజల్లోకి వస్తున్నారని, కరెంటు ఎక్కడ పోయిందో చెప్పాలని తుమ్మల నిలదీశారు. రోజుకు రూ.50లక్షలు వెచ్చించి విద్యుత్ కొనుగోలు చేస్తున్నామని, ప్రతి క్షణం రైతు బాగు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన అన్నారు. ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రఘురాంరెడ్డిని కాంగ్రెస్ నాయకులంతా కలిసికట్టుగా పనిచేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి జిల్లా మంత్రుల విలువ పెంచేలా కృషి చేయాలన్నారు.



సేవ చేసేందుకే వచ్చాను

కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి

6

కేసీఆర్ ఓర్వలేకపోతున్నారు...


తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మూడు నెలల్లోనే ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలు అమలు చేసి ప్రజాదరణ పొందుతోందని, దీనిని

మిగతా 6వ పేజీలో...

లోక్‌సభ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించు కునేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచార రంగంలోకి దిగారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు తేలడం, నామినేషన్ల దాఖలు ప్రక్రియ పూర్తికావడంతో ఓటర్లను తమవైపు తిప్పుకొనేందుకు ప్రచార పర్వాన్ని వేగవంతం చేశారు. ఇప్పటికే నామినేషన్లు వేసిన కొందరు తమ గుర్తు, పార్టీ అభ్యర్థిత్వాన్ని ప్రచారం ద్వారా ఓటర్లలోకి తీసుకువెళ్తున్నారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ నామా నాగేశ్వరరావు, బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు ప్రచారాన్ని ఉధృతం చేశారు. ప్రచార రథాల ద్వారా తమ పేరు, గుర్తు, పాటలతో ప్రచారం సాగిస్తున్నారు.



ఖమ్మంలో వాకర్స్‌తో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి



ప్రచా రణం

- జోరుగా రోడ్ షోలు, సభలు, సమావేశాలు
- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్ల వేట
- అలస్యంగా మొదలైన కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం
- జోరు మీదున్న బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు
- ప్రచారపర్వంలో పాల్గొననున్న మోదీ, నడ్డా, రేవంత్, చంద్రబాబు

నామినేషన్ల పర్వం ముగియడంతో ఉధృతం చేసిన అభ్యర్థులు

ఖమ్మం ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార కార్యాచరణను ప్రారంభించింది. ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని అధిష్ఠానం నియమించింది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మహబూబాబాద్ ఇన్‌చార్జిగా నియమించారు. మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి బలరాంనాయక్, బీఆర్ఎస్ నుంచి మాలోతు కవిత, బీజేపీ నుంచి మాజీ ఎంపీ సీతారాంనాయక్ బరిలో ఉన్న విషయం విదితమే. ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏడు ఖమ్మం లోక్‌సభ పరిధిలో ఉండగా, మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. దీంతో రెండు నియోజకవర్గాలను కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రచారం చేపట్టబోతుంది. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు.



ములకలపల్లిలో రోడ్‌షోలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి వినోద్‌రావు

మంత్రి తుమ్మల మహబూబాబాద్ నియోజకవర్గ బాధ్యతలు చూసుకుని ఖమ్మం నియోజకవర్గంలో కూడా పాల్గొననున్నారు. రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరితో పాటు పలువురు ప్రచారానికి రానున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమల్లో ఉన్న ఆరుగ్యారంటీల అమలుపై ప్రచారం సాగిస్తున్నారు. ఇటు సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటు సీపీఎం, సీపీఐలు కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నందున వామపక్షాల పార్టీల జెండాలు ప్రచారంలో రెపరెపలాడుతున్నాయి. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం సహాయ కార్యదర్శి పోతినేని సుదర్శన్ ప్రచారంలో పాలుపంచుకోబోతున్నారు.

ఇక బీఆర్ఎస్ నుంచి ఖమ్మం అభ్యర్థి నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ అభ్యర్థి మాలోతు కవితలు ప్రచారంలో నిమగ్నమయ్యారు. అభ్యర్థుల ప్రకటన ముందే జరగడంతో ఇప్పటికే నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించారు. నామా తరుపున మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, వనమా వెంకటేశ్వరరావు, బానోతు మదన్‌లాల్, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు,



సత్తుపల్లి నియోజకర్గం బుగ్గపాడులో ప్రసంగిస్తున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

కందాల ఉపేందర్‌రెడ్డి ప్రచారంలో పాల్గొంటున్నారు. మహబూబాబాద్‌లో కవిత తరఫున అక్కడి మాజీ ఎమ్మెల్యేలు ప్రచారం నిర్వహిస్తున్నారు.

ఇక బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఖమ్మంలో ప్రచారం నిర్వహించగా కేంద్రమంత్రులతో పాటు పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, ప్రధాని నరేంద్ర మోదీ తదితరులు కూడా ప్రచారానికి రాబోతున్నారు. తెలుగుదేశం ఎన్డీయే కూటమిలో ఉన్నందున టీడీపీని కలుపుకొని మోదీ, చంద్రబాబునాయుడులతో ఖమ్మంలో ఎన్డీయే సభ నిర్వహించబోతున్నారు. ఇలా మూడు ప్రధాన పార్టీల నేతలు ప్రచారపర్వంపై దృష్టి సారించారు. ప్రచార రథాలు, ఇంటింటికి ప్రచారాలు కూడా నిర్వహిస్తున్నారు.

16,31,039

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ ఓటర్ల సంఖ్య

- పురుషులు 7,87,160, మహిళలు 8,43,149
- 1896 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- 29న నామినేషన్ల ఉపసంహరణ.. అదే రోజు తుది జాబితా ప్రకటన
- స్క్రూటినీలో నలుగురి నామినేషన్ల తిరస్కరణ
- 'ఖమ్మం' రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్

ఖమ్మం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన పూర్తయిందని, ఇక ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ వెల్లడించారు.తన చాంబర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మొత్తం 45మంది అభ్యర్థులు 72 నామినేషన్లు సెట్లు వేయగా.. అందులో 56 సెట్లు సక్రమంగా ఉన్నాయని, 16సెట్లు తిరస్కరించామని, 4 అభ్యర్థులకు సంబంధించిన నామినేషన్లు పూర్తిగా చెల్లలేదని, ఇప్పటి వరకు 41మంది అభ్యర్థుల నామినేషన్లు మాత్రమే సక్రమంగా ఉన్నాయని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు వేసిన నామినేషన్లకు కొందరు ఏ ఫాం, బీ ఫాంలు ఇవ్వనందున వారి నామినేషన్లు తిరస్కరించడం జరిగిందని కలెక్టర్ వివరించారు.

సోమవారం నామినేషన్ల ఉపసంహరణ,అదేరోజు అభ్యర్థుల జాబితా, ఎన్నికల గుర్తులు కేటాయింపు ఉంటుందని కలెక్టర్ తెలిపారు. 85ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగులకు మే 3 నుంచి 8వరకు హోం ఓటింగ్ జరుగుతుందని, ఇది పూర్తిగా మొబైల్ పోలింగ్ బూత్ వలే ఈవీఎంలు, ఎన్నికల సిబ్బంది, భద్రత, పోలింగ్ ఏజెంట్లు, వీడియో రికార్డింగ్‌తో రహస్య ఓటింగ్ నిర్వహిస్తామని కలెక్టర్ వివరించారు. ఓటరుస్లిప్పుల పంపిణీ కార్యక్రమం కూడా ప్రారంభించడం జరిగిందని, దశలవారీగా ప్రతీ ఓటరుకు ఓటరు స్లిప్పు అందుతుందని, ఓటరు స్లిప్పు ఓటుకు ప్రమాణం కాదని గుర్తింపు కార్డు తప్పనిసరి అని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసులు, ఉద్యోగులు, అధికారులకు ఖమ్మం లోక్‌సభ ఓటర్లయి ఉంటే వారికి ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్లు ముందుగానే ఇవ్వడం జరుగుతుందని, పోలింగ్ రోజున ఎన్నికల విధులు నిర్వహించే పోలింగ్ బూత్‌లో ఈడీ సర్టిఫికెట్ చూపించి ఓటు వేసుకునే సౌలభ్యం కలుగుతుందన్నారు. ఇప్పటికే 1600మంది పోలీసులకు ఈడీ సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ వివరించారు.

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు..

ఖమ్మం లోక్‌సభ పరిధిలో 16,31,039 మంది ఓటర్లు ఉన్నారని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వివరించారు. జిల్లాలో పురుషులు 787160, మహిళలు 843149 ఉన్నారని కలెక్టర్ వివరించారు. మొత్తం 1896 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఖమ్మంజిల్లా పరిధిలోని 5 నియోజకవర్గాల్లో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, భద్రాద్రి జిల్లాలోని కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలకు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటలకే పోలింగ్ ముగుస్తుందని ఈ రెండు నియోజకవర్గాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో ఉన్నందున ముందే పోలింగ్ ముగుస్తుందన్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు టెంట్లు, కూలర్లు, మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ టీం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.



మే 3నుంచి హోమ్ ఓటింగ్

- 80 ఏళ్లు దాటిన వృద్ధులకు, దివ్యాంగులకు అవకాశం

7

లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ జనరల్ అబ్జర్వర్‌గా డాక్టర్ సంజయ్ గాంద్రేజ్ కోల్టే, పోలీసు అబ్జర్వర్‌గా చరణ్‌జిత్‌సింగ్, ఖమ్మం, పాలేరు, మధిర వ్యయ పరిశీలకులుగా అరుణ్ ప్రస్త కృష్ణస్వామి, వైరా, సత్తుపల్లి, కొత్తగూడెం, అశ్వారావుపేటలకు వ్యయ పరిశీలకులుగా శంకర్ ఆనందమిశ్రాను నియమించడం జరిగిందని, వీరికి ఫిర్యాదులుంటే చేసుకోవచ్చని తెలిపారు.

ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గంలో సోదాల్లో కోటి 59లక్షల130 రూపాయలు సీజ్ చేయడం జరిగిందని, 47 లక్షల36వేల విలువైన మద్యాన్ని సీజ్ చేశామని, 11లక్షల 47వేల విలువైన గంజాయి కూడా పట్టుకున్నామని తెలిపారు. జిల్లాలో రూ.50వేల కంటే డబ్బులు ఎవరు తీసుకెళ్లకూడదని దానికి సంబంధించిన రశీదులు చూపాలని, ఇప్పటివరకు 12చోట్ల సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నామని, మరో 24 చెకింగ్ పాయింట్లు ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేస్తున్నామని తెలిపారు.



కాంగ్రెస్‌లో చేరిన ఎడవల్లి, సంబాని

- గాంధీభవన్‌లో కండువా కప్పి ఆహ్వానించిన చేరికల కమిటీ చైర్మన్ జగ్గారెడ్డి
- సీఎం సమక్షంలో తీర్థం పుచ్చుకోనున్న కోనేరు చిన్ని

6

కౌంటింగ్ ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు

- కేంద్రాన్ని సందర్శించిన పరిశీలకులు
- లోటుపాట్లు తలెత్తకుండా చూడాలని ఆదేశం

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 26: నగరంలోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న లోకసభ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు పనులను ఎన్నికల సాధారణ పరిశీలకుడు సంజయ్ జి.కోల్టే, పోలీస్ పరిశీలకుడు చరణ్‌జిత్‌సింగ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌లతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఖమ్మం లోకసభ ఎన్నికలకు సంబంధించి ఎన్నికలలెక్కింపు కేంద్రాన్ని, స్ట్రాంగ్‌రూంల ఏర్పాట్లు చైతన్య కళాశాలలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎన్నికల లెక్కింపు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్‌కోసం ఏర్పాటు చేసే గదులను పరిశీలించి, పార్కింగ్ సదుపాయాలతోపాటు, భద్రతాపరమైన అంశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. లెక్కింపు టేబుళ్ల కూర్పు, అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్ల ప్రవేశం, ఈవీఎంల కదలికలపై సూచనలు ఇచ్చారు.ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. సీసీ కెమెరాలు, లైటింగ్, బారికేడ్లు, పార్కింగ్, మీడియా సెంటర్ అన్ని వసతులు కల్పించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు చేపట్టిన చర్యలు పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంల భద్రతకు ర్యాక్‌లను పరిశీలించారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్లకు ఒక్కో సెగ్మెంట్‌కు ఒక్కో కలర్‌కోడ్ పెట్టి, ఆ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన ఫ్లెక్సీలు, ఈవీఎం రవాణా సిబ్బంది టీషర్టులు అదే కలర్‌లో ఉండి, ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. లెక్కింపు ప్రక్రియ, భద్రతా చర్యల గురించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, మిర్నల్ శ్రేష్ఠ, శిక్షణ ఐపీఎస్ పి.మౌనిక, జిల్లా రెవెన్యూ అధికారిణి రాజేశ్వరి, ఆర్డీవోలు గణేష్, రాజేందర్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్యామ్ ప్రసాద్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేందర్, లాండ్ సర్వే ఏడీ శ్రీనివాసులు, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీలత తదితరులు ఉన్నారు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సాధారణ పరిశీలకులు, రిటర్నింగ్ అధికారి

పెరిగిన వడగాలులు

అశ్వాపురంలో 44.8, వైరాలో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు

ఖమ్మం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు తోడు ఉమ్మడి ఖమ్మంలో వడగాలుల తీవ్రత కూడా పెరుగుతూ వస్తోంది. ఉదయం పదిగంటల నుంచే వేడిగాలులతో కూడిన వాతావరణం ఉంటుండటంతో ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. కాగా శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలో 44.8డిగ్రీలు, ఖమ్మం జిల్లాలోని వైరాలో అత్యధికంగా 44.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదయ్యాయి. మరోవైపు అత్యల్ప ఉష్ణోగ్రతలు కూడా ఏమాత్రం తగ్గని పరిస్థితి నెలకొంది. ఫలితంగా రాత్రి వేళల్లో కూడా వెచ్చని గాలుల ప్రభావం కొనసాగుతోంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం సదాశివునిపాలెంలో 24.3 డిగ్రీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మల్కాపురంలో 24డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓటర్లు...

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి తుది ఓటరు జాబితాను అధికారులు వెల్లడించారు. ఈనెల 25 వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి నూతన ఓటర్లను నమోదు చేశారు. ఈ మేరకు నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు...


నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	ఎన్నారై	సర్వీస్
ఖమ్మం	1,55,284	1,68,740	49	3,24,073	84	76
పాలేరు	1,15,717	1,25,081	8	2,40,806	19	167
మధిర	1,07,111	1,15,039	10	2,22,160	41	150
వైరా	93,700	99,683	6	1,93,389	14	199
సత్తుపల్లి	1,18,490	1,25,441	12	2,43,943	31	109
మొత్తం	**5,90,302**	**6,33,984**	**85**	**12,24,371**	**189**	**701**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో...						
కొత్తగూడెం	1,19,477	1,27,979	38	2,47,494	30	161
అశ్వారావుపేట	77,381	81,786	7	1,59,174	8	51
మొత్తం	**1,96,858**	**2,09,765**	**45**	**4,06,668**	**38**	**212**

- ఖమ్మం కలెక్టరేట్

భౌగోళికంగా దూరమైనా... రాజకీయంగా దగ్గరే!

ఖమ్మానికి మహబూబ్‌నగర్‌కు రాజకీయ అనుబంధం

6



- కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటాపోటీ సమావేశాలు
- వేడెక్కిస్తున్న నేతల ప్రసంగాలు
- మెజారిటీపై ఎవరికి వారు ధీమా
- ఆసక్తిరేపుతున్న మహబూబాబాద్ ఎంపీ పోరు

పినపాకలో రాజకీయ వే 'ఢీ'

పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి సంబంధించి పినపాక నియోజకవర్గంలో ఆసక్తి కర రాజకీయాలు నడుస్తున్నాయి. ఇటు అధికార పార్టీలోనూ అటు ప్రతిపక్ష పార్టీలోనూ గెలుపు మాది అంటే మాదే అన్న ధీమా కనిపిస్తోంది. కాంగ్రెస్ నాయకులు చేతి గుర్తుకు అధిక ఓట్లు పోలయ్యేలా సమాలోచనలు చేస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు గత అసెంబ్లీ ఎన్నికలలో జరిగిన పొరపాట్లను తిరిగి పునరావృతం కానివ్వకుండా కారు జోరు పెంచడానికి వ్యూహాలు పన్నుతున్నారు.

మణుగూరు, ఏప్రిల్ 25: ఇప్పటి వరకు అధికార పార్టీ కాంగ్రెస్ పినపాక నియోజకవర్గ మండల కేంద్రంగా ఉన్న మణుగూరులో నాలుగు సార్లు సమావేశాలను నిర్వహించింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాజీ ఎంపీ పోరిక బలరామ్ నాయక్ జరిగిన ప్రతి సమావేశంలో హాజరై తన గెలుపునకు సహకరించాలని నాయకులను కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం గల డివిజన్ సీనియర్ నేత తుళ్లూరి బ్రహ్మయ్య, సీపీఐ రాష్ట్ర నేత అయోధ్యతో పాటు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కూడా ఈ ఎన్నికల్లో గెలుపు కంటే మెజారిటీ పై దృష్టి సారిస్తున్నారు. ఈ మేరకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు.

పోటా పోటీ సమావేశాలు..

పినపాక నియోజకవర్గంలో అధికార పార్టీ కాంగ్రెస్ పార్టీ నాయకులు నాటి బీఆర్ఎస్ వైఫల్యాలను ఎజెండాగా తీసుకుని తాము చేయబోయే పనులు ప్రజలకు వివరిస్తూ ఓటర్లను చేరువ చేసుకునే పనిలో పడ్డారు. అయితే ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ కూడా గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వ హామీలు అన్నీ మోసపూరితమే అంటూ పేర్కొంటూ జరగబోయే ఎన్నికల్లో తెలిపిస్తే మరింత అభివృద్ధికి పాటుపడతామని ప్రజలకు దగ్గరైయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ సమావేశాల ద్వారా ఓటు బ్యాంకును పదిల పరుచుకునే ప్రయత్నాలు సాగిస్తుంటే .. సోషల్ మీడియా ద్వారానే విస్తృత ప్రచారాలు సాగించాలని అవే ప్రజలకు తొందరగా చేరువ అవుతాయని రేగా, ఎంపీ అభ్యర్థులు నాయకులు కార్యకర్తలకు సూచిస్తున్నారు.

బీఆర్ఎస్ నుంచి జిల్లా పార్టీ అధ్యక్షుడు రేగా కాంతారావు కూడా నియోజకవర్గ వర్గ స్థాయిలో బీఆర్ఎస్ శ్రేణులను ఏకం చేసి మాజీ ఎంపీ మాలోత్ కవితతో సమావేశాన్ని కూడా ఏర్పాటు చేశారు. రేగా కాంతారావు గత అసెంబ్లీ ఎన్నికల్లో 36 వేల ఓట్ల తేడాతో ఓటమి పాలు కాగా ఆ ఓటమికి తగిన ప్రతికారంగా ఎంపీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని రంగంలో దిగినట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా నాడు టీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉండగా గత ఎన్నికల్లో తాజా మాజీ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవితపై ఓటమిని చవి చూసిన బలరామ్ నాయక్ ఈ దఫా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండే సరికి గెలుపుపై ధీమాను వ్యక్తం చేస్తున్నారు.

అంతర్గత విభేదాలు

బడా నాయకులు వస్తున్నారు. సమావేశాలు నిర్వహించి పోతున్నారు. అప్పటి వరకే ఆ సమావేశాల్లోనే అంతా సమష్టిగా ఉన్నట్లు కనిపించే నాయకుల్లో తదనంతరం సఖ్యత లోపించింది. ఇది అధికార పార్టీ నాయకులతో పాటు ప్రతిపక్ష పార్టీ నాయకుల్లో కూడా తీవ్ర స్థాయిలో కనిపిస్తోంది. అధికార పార్టీలో ఓ సామాజిక వర్గం నాయకులు రెండుగా చీలిపోయడం, కష్టపడే వారి కంటే షో చేసే వాళ్లకు ఎమ్మెల్యే ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపనలు బలంగా వినిపిస్తున్నాయి. ఇక ప్రతిపక్షం విషయానికి వస్తే గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘోర పరాజయం పాలు కావాడాన్ని ఆ పార్టీ నియోజకవర్గ శ్రేణులు జీర్ణించుకోలే పోతున్నారు. అంతే కాకుండా కొందరికే ప్రాధాన్యం ఇస్తున్నారని కనీసం మాజీ ఎమ్మెల్యే రేగాతో మాట్లాడే అవకాశం కానీ నియోజక వర్గ సమావేశాల్లో మంచి చెడులు చెప్పుకొనేందుకు కనీసం అవకాశాలు కూడా కల్పించడం లేదనే ప్రస్తావనపై సీనియర్ నాయకుడు వట్టం రాంబాబుతో పలు పలువురు మహిళా నాయకురాళ్లు కూడా సభ వేదికపై నిలదీసిన సంఘటనలు ఇక్కడ చోటు చేసుకున్నాయి. నెలకొన్న వర్గ విబేదాలు, అంతర్గత విభేదాలు, మనస్పర్థలు రెండు పార్టీ బడా నేతలకు కాస్త గుదిబండలా మారాయి.

భౌగోళికంగా దూరమైనా... రాజకీయంగా దగ్గరే..

- ఖమ్మానికి మహబూబ్ నగర్‌కు రాజకీయ అనుబంధం
- అక్కడి నుంచి ఇక్కడకు తెళ్ల లక్ష్మీకాంతమ్మ
- ఇక్కడి నుంచి అక్కడకు మల్లు సోదరులు



తేళ్ల లక్ష్మీకాంతమ్మ



మల్లు అనంతరాములు



మల్లు రవి

ఖమ్మం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కోసారి ఒక్కో అనుబంధం ఉంటుంది. అది భౌగోళికంగా ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలు చాలా దూరమే అయినా రాజకీయంగా ఒక్కటైన సందర్భాలున్నాయి. ఈ రెండు జిల్లాలకు రాజకీయ అనుబంధం ఉండడం చెప్పుకోదగిన విషయం. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి కాంగ్రెస్ తరుపున ఒక ఖమ్మం ఎంపీగా పోటీ చేసి గెలిస్తే ఖమ్మం జిల్లా నుంచి ఇద్దరు సోదరులు మహబూబ్ నగర్ జిల్లాకు వెళ్లి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు ఇక్కడ వారు అక్కడ. అక్కడ వారు ఇక్కడ పోటీ చేసి గెలుపొందడంతో ఈ రెండు జిల్లాలకు రాజకీయ అనుబంధం అనుకోకుండా ఏర్పడింది.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అలంపూర్‌లోని జమీందార్ కుటుంబానికి చెందిన తేళ్ల లక్ష్మీకాంతమ్మ ఖమం జిల్లా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఉన్నత విద్యావంతురాలైన లక్ష్మీకాంతమ్మ 1957లో ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరుపున పోటీ చేశారు అప్పటి కమ్యూనిస్టు పార్టీకి గట్టి పోటీ ఇచ్చారు . ఆ తర్వాత ఖమ్మం లోక్‌సభకు తేళ్ల లక్ష్మీకాంతమ్మ 1962, 1967, 1971లో ఖమ్మం ఎంపీగా గెలిచి కాంగ్రెస్ రాజకీయాల్లో తనదైన పాత్ర పోషించారు. కాగా ఖమ్మం జిల్లా వైరా మండలం లక్ష్మీపురంకు చెందిన మల్లు అనంతరాములు, మల్లు రవి సోదరులిద్దరు మహబూబ్‌నగర్ జిల్లా నాగర్‌కర్నూల్ ఎస్సీ రిజర్వుడు ఎంపీ స్థానానికి పోటీ చేసి గెలిచారు.

1978లో అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి ప్రోత్సాహంతో రాజకీయాల్లో రాణించారు. నాగర్‌కర్నూల్ ఎంపీ స్థానం నుంచి గెలుపొందారు 1980లో తొలిసారి ఎంపీగా పనిచేశారు. తర్వాత 1989లో నాగర్‌కర్నూల్ ఎంపీగా విజయం సాధించారు. ఆయన మరణించడంతో 1991 లోక్ సభ ఎన్నికల్లో ఆయన సోదరుడు మల్లు రవి విజయం సాధించారు. ఇదే స్థానం నుంచి 1998లో కూడా మల్లు రవి ఎంపీగా గెలుపొందారు. ఈ విధంగా మహబూబ్‌నగర్ జిల్లా అలంపూర్‌కు చెందిన తేళ్ల లక్ష్మీకాంతమ్మ ఖమ్మం వచ్చి పోటీచేసి గెలిస్తే జిల్లాలోని లక్ష్మీపురంకు చెందిన మల్లు బ్రదర్స్ మల్లు అనతరాములు, మల్లు రవి నాగర్‌కర్నూల్‌లో విజయం సాధించారు. ఈసారి కూడా మల్లు రవి నాగర్‌కర్నూల్‌లో ఎన్నికల బరిలో ఉన్నారు. ఇలా ఆనాటి నుంచి ఈనాటి వరకు ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లా మధ్య రాజకీయ అనుబంధం కొనసాగుతూనే ఉంది.



సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎడవల్లి

సొంత గూటికి 'ఎడవల్లి'

- జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక

చుంచుపల్లి, ఏప్రిల్26: సొంత గూటికి సీనియర్ నాయకుడు ఎడవల్లి కృష్ణ మళ్లీ చేరారు. శుక్రవారం హైదారాబాద్ గాంధీభవన్‌లో చేరికల కమిటీ చైర్మన్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఎడవల్లి కృష్ణ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎడవల్లి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోనే రాజకీయంగా ఎదిగానని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథ కాలు ప్రజల్లోకి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేస్తూ రాహుల్‌గాంధీని ప్రధాని చేసే వరకు విశ్రమించబోమన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం హైదారాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎడవల్లి కృష్ణ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎడవల్లితో పాటు కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో నాయకులు రాయల శాంతయ్య, చావా వీరయ్యచౌదరి, బొమ్మిడి మల్లిఖార్జున్, పల్లపు వెంకటేశ్వర్లు, సిరంగి శ్రీనివాస్, చింత నాగరాజు, చారి, పెంకి శ్రీను, కత్తెర హన్మంతరావు, శెట్టిపల్లి వెంకట్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన 'సంబాని'

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్26: సొంతపార్టీ కాంగ్రెస్‌లోకి శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ వద్ద మాజీమంత్రి సంబాని చంద్రశేఖర్ చేరారు. చేరికల కమిటీ ఆధ్వర్యంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, కిషాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరామిరెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. తనను నమ్ముకున్న కార్యకర్తలు, నాయకుల కోసం, కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు శ్రమిస్తానని సంబాని అన్నారు. సంబానితో పాటు పార్టీలో చేరినవారిలో సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కొర్రపాటి సాల్మన్‌రాజు, పీసీసీ మెంబర్ బైరెడ్డి మనోహర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోళ్ల అప్పారావు, కల్లూరు, పెనుబల్లి, వేంసూరు మండలాల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పెద్దబోయిన దుర్గాప్రసాద్, చెలికాని రాజబాబు, మాజీ ఎంపీపీ జే.గోపాలస్వామి, ఎంపీటీసీ కొండూరి కిరణ్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వాళ్ల అప్పారావు, ఎస్సీ సెల్ కన్వీనర్ తుమ్మూరు లక్ష్మారెడ్డి, కిన్నెర లాజర్, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, జొన్నలగడ్డ సమ్మయ్య, గోపాలస్వామి, అఫ్రోజ్, సందీప్, గణేష్, సురేష్ తదితరులు ఉన్నారు.

ఘర్‌వాపసీ.. జడ్పీటీసీ ప్రవీణ్



జగ్గారెడ్డితో ప్రవీణ్

కామేపల్లి, ఏప్రిల్ 26: కామేపల్లి జడ్పీటీసీ సభ్యుడు బానోత్ వెంకటప్రవీణ్ కుమార్ నాయక్ సొంతగూటికి చేరారు. హైద్రాబాద్ గాంధీభవన్‌లో చేరికల కమిటీ చైర్మన్ జగ్గారెడ్డి సమక్షంలో ఘర్‌వాపసీ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పొన్నెకల్ మాలోత్ శంకర్ నాయక్ ఉన్నారు.

చెయ్యందుకోనున్న కోనేరు చిన్ని?



కొత్తగూడెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకుడు, మాజీమంత్రి కోనేరు నాగేశ్వరరావు తనయుడు కోనేరు సత్యనారాయణ(చిన్ని) కాంగ్రెస్ గూటికి చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన చిన్ని రెండేళ్ల క్రితం బీజేపీలో చేరి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ ఓటమితో స్తబ్ధుగా ఉన్న ఉన్న చిన్ని కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. మంత్రి పొంగులేటి సమీపబంధువు రామసహాయం రఘురామరెడ్డి కాంగ్రెస్ నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న నేపథ్యంలో చిన్నిని పొంగులేటి ఆహ్వానించినట్లు తెలుస్తోంది. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటు ముఖ్యఅనుచరులతో రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారు.

ఎంపీ సీటుకు పోట్ల అర్హుడు : జేబీ శౌరీ

చుంచుపల్లి, ఏప్రిల్ 26: ఖమ్మం ఎంపీ సీటుకు పీసీసీ ఉపాధ్యక్షుడు పోట్ల నాగేశ్వరరావు పూర్తిగా అర్హుడని టీపీసీసీ సభ్యుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ జేబీ శౌరీ అన్నారు. శుక్రవారం చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ కాలనీలో కొత్తగూడెం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పదేళ్లుగా బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పని చేసిన వారిని ప్రస్తుతం వారికి గుర్తింపు కరువైందని, పట్టించుకోలేని దుస్థితి ఎదుర్కొంటున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోట్ల నాగేశ్వరరావు తీసుకునే నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉన్నామని ఏకగ్రీవంగా తీర్మానం చేస్తున్నట్లు ప్రకటించారు.

రైతుబిడ్డపై దిగుమతి నాయకుడి పోటీ

- బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు



మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు

సత్తుపల్లి/ వేంసూరు/ ములకలపల్లి, ఏప్రిల్26: రైతుబిడ్డగా ఉన్న తనమీద హైదరాబాద్ నుంచి దిగుమతి నాయకుడిని కాంగ్రెస్ పార్టీ పోటీ పెట్టిందని, సూట్‌కేసులతో ఎన్నికలకు వచ్చిన ఆయన సూట్‌కేసులతోనే ఎన్నికల తర్వాత జనాలకు కనిపించకుండా వెళ్లిపోతాడని బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విమర్శించారు. శుక్రవారం సత్తుపల్లి నియోజకవర్గంలోని సత్తుపల్లి మండలం బుగ్గపాడు, తుంబూరు, వేంసూరు మండలంలో మర్లపాడు, అడసర్లపాడు తో పాటు ములకలపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, కాంగ్రెస్ నాయకుల మాటలను నమ్మటంతో నష్టం జరిగిందన్నారు. ప్రజా సంక్షేమం కోసం పోరాడే బీఆర్ఎస్ కారు గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. మంత్రివర్గంలో సామాజిక న్యాయం లేదని, ముస్లిం, మైనార్టీలతో అనేక సామాజిక వర్గాలకు స్థానం లేకుండా కాంగ్రెస్ పార్టీ పాలన సాగిస్తోందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. నియోజకవర్గంలో గతంలో బాగా చేసిన పనులన్నీ ఈ వందరోజుల్లో రద్దు చేసుకుంటూ పోతున్నారని అన్నారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు నామా నాగేశ్వరరావును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, యాగంటి శ్రీను, శీలపురెడ్డి హరికృష్ణారావు, దొడ్డా శంకర రావు, చిలుకుర్తి కృష్ణమూర్తి, బొడ్డు శివబాబు, వేంసూరులో మండలంలో గొర్ల సంజీవరెడ్డి, పాలా వెంకటరెడ్డి, పగుట్ల వెంకటేశ్వరరావు, కంటె వెంకటేశ్వరరావు, పుచ్చకాయల శంకర్‌రెడ్డి, దొడ్డా వెంకటకృష్ణారెడ్డి, మందపాటి మహేశ్వరరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యం

- ఖమ్మం బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు



ఇస్త్రీ చేస్తూ ఎన్నికల ప్రచారం చేస్తున్న వినోద్‌రావు

చుంచుపలి/ ములకలపల్లి, ఏప్రిల్ 26: బీజేపీతోనే దేశంలో సుస్థిర పాలన సాధ్యమని, ప్రధానిగా మోదీని గెలిపిస్తేనే దేశంలో పాలన బాగుంటుందని ఖమ్మం బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. శుక్రవారం ములకలపల్లి, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో రోడ్‌షో ద్వారా ప్రచారం నిర్వహించారు. ములకలపల్లిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉభయ జిల్లాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి తీర్చిదిద్దుతానన్నారు. మోదీ దూతగా మీరంతా తనని ఆశీర్వదించాలని, ఈ ఎన్నికల్లో బీజేపీని మరోసారి బలపర్చి సుస్థిరమైన పాలనకు అవకాశం కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన మహిళలు, కూలీలు బీజేపీలో చేరగా వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఇస్త్రీ చేస్తూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి దుకాణం వద్దకు, ఓటర్ల వద్దకు వెళ్లి కరచాలనం చేస్తూ అమూల్యమైన తమ ఓటును వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్, నాయకులు ప్రభారినంబూరి రామలింగేశ్వరరావు, దుర్గా శ్రీనివాసరావు, శ్రీనివాస్, సీతారాములు, అప్పయ్య పాల్గొన్నారు.

నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలి

- సహాయ రిటర్నింగ్ అధికారులతో పరిశీలకులు



మాట్లాడుతున్న సాధారణ పరిశీలకులు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 26: ఎన్నికల సంఘం నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకుడు డా. సంజయ్ జి. కోల్టే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్ పరిశీలకులు చరణ్‌జీత్ సింగ్, వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాత్ కృష్ణసామి, శంకర ఆనంద్ మిశ్రా, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలన్నారు. శాఖలు సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ పరిశీలకుడు చరణ్‌జీత్ సింగ్, వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాత్ కృష్ణ సామి, శంకర ఆనంద్ మిశ్రా లు రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్, అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సుధాకర్ బైక్‌యాత్రలో తహసీల్దార్ సాంబశివుడు

100 శాతం ఓటింగ్ లక్ష్యంగా ఉపాధ్యాయుడి బైక్‌యాత్ర

కల్లూరు, ఏప్రిల్ 26: వంద శాతం ఓటింగ్ లక్ష్యంగా మండల పరిధిలోని చెన్నూరు గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దంతాల సుధాకర్ చేపట్టిన ఓటరు చైతన్య బైక్ యాత్రను చేపట్టారు . ఈ యాత్రను శుక్రవారం తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ నెల 24న కలెక్టర్ ఈ యాత్రను ప్రారంభించారని సుధాకర్ తెలిపారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

చెక్‌పోస్టు ఆకస్మిక తనిఖీ

కొత్తగూడెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు క్రాస్ రోడ్డు వద్ద గల చెక్‌పోస్టును శుక్రవారం ఎస్పీ రోహిత్‌రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓటర్లను ప్రభావితం చేసే విధంగా అక్రమంగా నగదు, మద్యం రవాణాను అరికట్టడానికి ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు.

రూ. లక్ష స్వాధీనం

ఇల్లెందు, ఏప్రిల్ 26: మండలంలోని సుభాస్‌నగర్ సమీపంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద శుక్రవారం సాయంత్రం పోలీసులు లక్ష రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ చంద్రభాను, సీఐ రత్నాకర్ పాల్గొన్నారు. తనిఖీల్లో ఇల్లెందు మండలం వేపల గడ్డ గ్రామానికి చెందిన భూక్యా ప్రశాంత్ కారు తనిఖీ చేయగా రూ.లక్ష లభించింది. సరైన ఆధారాలు చూపించక పోవడంతో వాటిని సీజ్ చేశారు.

సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి



రాండమైజేషన్‌ను నిర్వహిస్తున్న ఆర్వో గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్/ కొత్తగూడెం, ఏప్రిల్ 26: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు వీపీ గౌతమ్, ప్రియాంక అలా తెలిపారు. శుక్రవారం ఆయా కలెక్టరేట్లలో పరిశీలకుడు సంజయ్ జి. కోల్టే, రాంకుమార్ గోపాల్‌తో కలిసి పోలింగ్ సిబ్బంది రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. జిల్లాలో జరిగే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు కలెక్టర్, ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్, వీపీ గౌతమ్, పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డా. సంజయ్ జి. కోల్టే తో కలిసి పోలింగ్ సిబ్బంది రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు.

రఘురాంరెడ్డి గెలుపు ఘనంగా ఉండాలి

(5వ పేజీ తరువాయి)

ఓర్వలేక మాజీ సీఎం కేసీఆర్ దిగజారి విమర్శలు చేస్తున్నారని రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. రామసహాయం రఘురాంరెడ్డి ఖమ్మం జిల్లా స్థానికుడని, సుదీర్ఘ రాజకీయ కుటుంబ నేపథ్యం ఉందన్నారు. సోనియా, రాహుల్ ఆశీస్సులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రేణుకాచౌదరి సహకారంతో సీటును పొందిన రఘురాంరెడ్డిని మనందరం అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్‌గా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. బీజెపీ పదేళ్ల పాలనలో దేశ విచ్చినం తప్ప చేసేందేమీ లేదన్నారు. పదేళ్ల పాలన చేసిన కేసీఆర్ తెలంగాణను దోపిడీ చేశారని, లక్షన్నర కోట్ల రూపాయలు దాచుకునేందుకు మరోసారి అధికారం కావాలని ఉద్యమం చేస్తానంటూ దిగజారుడు మాటలతో మళ్లీ ప్రజల్లోకి వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పొంగులేటి అన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ రైతుల కోసం పనిచేస్తోందని, రాహుల్ గాంధీని ప్రధానిగా చేసే లక్ష్యంతో ముందుకెళతామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రఘురాంరెడ్డి, విజయబాబు, ఆలపాటి రామచంద్ర ప్రసాద్, జూపల్లి రమేష్, కేవీ సత్యనారాయణ, కాంగ్రెస్ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి కొదుమూరి దయాకరరావు, ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు, పార్టీ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవచేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా

- రఘురాంరెడ్డి

ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థిగా తనను గెలిపిస్తే సేవే లక్ష్యంగా పని చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. దమ్మపేట మండలం ముష్టిబండ సమీపంలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ సమీపంలో అశ్వారావుపేట నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈసందర్భంగా రఘురాంరెడ్డి మాట్లాడుతు తాను ఖమ్మంజిల్లా వాసిని కాదని కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించారు. తాను కూసుమంచి మండలంలోని చేగొమ్మ గ్రామ వాసినని, తమకు ఖమ్మంలో ఇల్లువుందని గుర్తు చేసారు. చీలంలోని నివాస గృహాన్ని పాఠశాలకు వితరణ ఇవ్వటం జరిగిందని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తెలంగాణా ఎంతో అభివృద్ధి జరగుతుందని అన్నారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో ముగ్గురు కీలక మంత్రులు వున్నారని వీరికి తోడుగా తనను గెలిపిస్తే ఈ జిల్లా అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. సేవ చేసేందుకు మాత్రమే రాజకీయాలలోకి వచ్చానని తన ప్రాణం వున్నంత వరకు జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ రఘురాంరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు సర్వశక్తులూ ఒడ్డాలని పిలుపునిచ్చారు.



ఆలయ ప్రతిష్ఠాపన వేడుకల్లో పొంగులేటి, రఘురాంరెడ్డి

రాముల వారికి మొక్కి.. గంగమ్మ తల్లిని పూజించి...

కూసుమంచి, ఏప్రిల్ 26: మల్లేపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన శ్రీసీతారామ ఆలయ ప్రతిష్ఠా మహోత్సవంలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామ్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ గర్భగుడిలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల వేద ఆశీర్వాదం పొందారు. అనంతరం గంగమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుకున్నారు. అనంతరం లోక్యాతండాలో నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు, జొన్నలగడ్డ రవికుమార్, బజ్జూరి వెంకటరెడ్డి, హపీజుద్దీన్, శ్రీనివాసరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, సేట్‌రామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'జిజ్ఞాస ప్రాజెక్టు'కు రాష్ట్ర ప్రథమ బహుమతి



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్

ఖమ్మం ఖానాపురంహవేలి ఏప్రిల్ 26: ఇటీవల రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు తెలంగాణ కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో నిర్వహించిన 'జిజ్ఞాస విద్యార్థి కేంద్రక అధ్యయన ప్రాజెక్టు' పోటీల్లో ఖమ్మం నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల గణిత విభాగం నుంచి 'పారామౌంట్ వాల్యూ ఆఫ్ వేదిక్ మేథమెటిక్స్‌ఇన్ కంప్యూటర్ ఇరా' అనే అంశంపై గణిత అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.అనురాధ పర్యవేక్షణలో సమర్పించిన నివేదికకు రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.మహ్మద్ జాకిరుల్లా తెలిపారు. ఐదుగురు విద్యార్థుల బృందంలో సభ్యులు ఎస్.రక్షిత, పి.రిషిక, కె.మనీషా, బి.లలిత, జి.చందు సమర్పించారని తెలిపారు. 132 డిగ్రీ కళాశాలలు పోటీలో పాల్గొన్నాయి. రూ.30వేల నగదు బహుమతిని త్వరలో హైదరాబాద్ లో అందజేస్తారని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్స్ డా.బి.వి.రెడ్డి, టీ.జీవన్, జిజ్ఞాస కోఆర్డినేటర్ డా.సీహెచ్.శ్రీనివాసులు ఐ.క్యూ. ఏసీ కోఆర్డినేటర్ డా.ఏ.ఆర్.సత్యవతి, గణిత విభాగాధిపతి బి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు డా.వి.సాంబశివరావు, కె.జ్యోతిర్మయి రాణి, కె.వి ఆర్ దుర్గ, ఉషాపావని అభినందనలు తెలిపారు.

అంతా ఓపెన్



- సార్వత్రిక పరీక్షలలో యథేచ్ఛగా మాస్ కాపీయింగ్ ?
- ఇష్టానుసారంగా ఇన్విజిలేటర్ల నియామకం
- పాస్ గ్యారంటీ పేరుతో ముందుగానే డబ్బులు వసూళ్లు

ఖమ్మం ఖానాపురంహవేలి ఏప్రిల్ 26: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు అంతా ఓపెన్‌గా జరుగుతున్నట్లు సమాచారం. ఓపెన్ స్కూల్ పరీక్షలలో కాపీయింగ్ యథేచ్ఛగా జరుగుతుందనే విమర్శలు వినపడుతున్నాయి. దీనికి ముఖ్య కారణం ఇన్విజిలేటర్ల నియామకంతోనే తొలి ప్రయత్నం ప్రారంభమయినట్లు సమాచారం. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు ఈ నెల 25న ప్రారంభంకాగా మే 2 వరకు నిర్వహించనున్నారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు మే 3 నుంచి 10వ తేది వరకు నిర్వహించనున్నారు. పదోతరగతి పరీక్షలకు ఐదు పరీక్షా కేంద్రాలలో 955 మంది విద్యార్థులు, ఇంటర్‌కు ఐదు పరీక్షా కేంద్రాలలో 1108 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. మొత్తం పది పరీక్షా కేంద్రాలలో 2063 మంది పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలని, పరీక్షా కేంద్రాలలోకి సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలతో అధికారులు, ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది, పరీక్షకు హాజరుకానున్న అభ్యర్థులను అనుమతించకుడదని ఆంక్షలు ఉన్నప్పటికి కొందరు గుట్టుచప్పుడు కాకుండ మొబైల్ ఫోన్స్ తీసుకెళ్తున్నట్లు సమాచారం.

ముందుగానే వసూళ్లు?

గతంలో సెంటర్ల వద్దనే అభ్యర్థుల నుంచే డబ్బులు వసూలు చేసేవారు ఈసారి రూటు మార్చి పాస్ చేయిస్తామని ముందుగానే మాట్లాడుకోని ఒక్కో అభ్యర్థి నుంచి రూ.3 నుంచి రూ.5 వేల వరకు వసూళ్ళు చేసినారనే వాదనలు వినపడుతున్నాయి. ఈ వ్యవహారమంతా జిల్లా విద్యాశాఖ అధికారుల కనుసనల్లోనే నడుస్తున్నట్లు విమర్శలు వినపడుతున్నాయి.సాధారణంగా ఉద్యోగాల కోసం, ప్రమోషన్ల కోసం, లైసెన్సుల కోసం పదోతరగతి, ఇంటర్ పరీక్షలు రాస్తుంటారు. రెగ్యులర్ విద్యార్థుల మాదిరిగా కొందరు చదవలేరు, కనీసం రాయడం కూడా రానివారు ఉంటారని తెలుస్తోంది. అయితే వారిని పాస్ చేయిస్తామని ఒక్కో అభ్యర్థి నుంచి వేలాది రూపాయలు సెంటర్ల వారిగా వసూలు చేయడానికి ప్రణాళిక సిద్ధమయినట్లు తెలుస్తోంది. స్టడీ సెంట్లలో ఉన్న తమ అనుచరులతో అభ్యర్థులను పాస్ చేయిస్తామని చెప్పి ప్యాకేజీలు మాట్లాడుతున్నట్లు సమాచారం. కాగా ఓపెన్ స్కూల్ పరీక్ష విధులు నిర్వహిస్తే సదరు ఉపాధ్యాయుడికి సంపాదిత సెలవులు వస్తాయి. వాటిని విక్రయించుకునే వెసులుబాటు ఉంటుంది. ఒక్కరోజు సెలవు సుమారు రూ.4వేల విలువ ఉంటుండగా, మొత్తం డ్యూటీలు చేస్తే రూ.40వేల జీతం అదనంగా అందనుంది. దీంతో ఉపాధ్యాయులలో పోటీ నెలకొంది.

ఇష్టానుసారంగా ఇన్విజిలేషన్ విధులు

జిల్లా కేంద్రంలో సార్వత్రిక పరీక్షలకు వేలాది రూపాయలు చేతులు మారడానికి రంగం సిద్ధమయినట్లు సమాచారం. ఇందుకు అనుగుణంగానే విద్యాశాఖ అధికారులు తమకు అనుకూలంగా వ్యవహరించే ఉపాధ్యాయులను విధులకు కేటాయిస్తూ జాబితా తయారు చేశారనే వాదనలు వినబడుతున్నాయి. కాగా తెలంగాణ ఎస్ఎస్ఎస్ బోర్డు పరీక్ష ఇన్విజిలేషన్ విధులు నిర్వహించిన వారికి కాదని, తమకు అనుకూలంగా ఉన్న వారినే నియమించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సీనియారిటీ బుట్టదాఖలు

సాధారణంగా సీనియార్టీ ప్రకారమే ఇన్విజిలేషన్ విధులు కేటాయిస్తుంటారు. సీఎస్‌లు డీవోలుగా సీనియార్టీని విస్మరించి ఇష్టానుసారంగా నియామకాలు చేసినట్లు విమర్శలు వస్తున్నాయి. నగరంలో ఉన్న వారిని కాదని దూర ప్రాంతాలకు చెందిన వారిని, మారుమూల- పాఠశాలల వారికి డ్యూటీలు కేటాయించారని తెలుస్తోంది. సీనియర్ ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ వారిని కాదని జూనియర్ ఉపాధ్యాయులకు ఇన్విజిలేటర్లగా అవకాశం కల్పించడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

స్వర్ణభద్రకవచాలతో దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్య

స్వామి వారిని దర్శించుకున్న ఖమ్మం న్యాయమూర్తి



నిత్యాన్నదానానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, ఏప్రిల్ 26: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారు శుక్రవారం సందర్భంగా స్వర్ణభద్రకవచాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే ఖమ్మం జిల్లా న్యాయస్థానం న్యాయాధికారి బీఎస్ జగ్జీవన్‌కుమార్ కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా వియవాడ గీతా మందిరం వాస్తవ్యులు నందూరి సాయిబాబా, వెంకటసత్యవాణి దంపతులు దేవస్థానం నిత్యన్నదాన పథకంకు రూ.50 వేలు విరాళంగా అందించారు.

క్లీనికల్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

● 10లోగా దరఖాస్తులు అందజేయాలి: ఆర్ఐవో

ఖమ్మం ఖానాపురంహవేలి ఏప్రిల్ 26: ఖమ్మం జిల్లాలో ఇంటర్మీడియట్, ఎల్‌టీ, ఎంఎల్‌టీ, ఒకేషనల్ కోర్సులో మార్చి-2019 సంవత్సరం నుంచి ఉతీర్ణులైన విద్యార్థులు ఒక సంవత్సరం క్లినికల్ శిక్షణ జిల్లాలోని ఏరియా అసుపత్రులు, కమ్యూనిటీ హాస్పిటల్స్‌లో అందజేస్తారని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె రవిబాబు తెలిపారు. ఈ శిక్షణకు ఎంపికైన విద్యార్థులు మాత్రమే రూ.1000 లు ఆసుపత్రి వారి పేరు మీదా డీడీ. రూపంలో చెల్లించాలన్నారు. గతంలో దరఖాస్తు చేసుకోని, ఎంపిక కానీ వారు కూడా తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ బయోడేటాకుస్వంత చిరునామా గల కవరును జతపర్చాలని తెలిపారు. సంబంధిత సర్టిఫికేటు జిరాక్సు కాపీలను కూడా జతపరచి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయం, కొత్త కలెక్టరేట్ ఖమ్మం నందు మే 10న సాయంత్రం ఐదు గంటలలోపు అందించాలని తెలిపారు.

ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్ 26: కొత్తగూడెం ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను అసిస్టెంట్ ఎక్సైజ్ ఆఫీసర్ కరంచందర్ ఆధ్వర్యంలో శుక్రవారం వేలం పాట నిర్వహించారు. మొత్తం పది వాహనాలకు ఈ వేలం పాట నిర్వహించగా ప్రభుత్వ వేలం పాట విలువ రూ.1.16 లక్షలుగా నిర్ణయించారు. అనంతరం ఈ వేలం పాటలో జీఎస్టీతో కలిపి మొత్తం రూ.2,35,410 వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జయశ్రీ, ఎస్ఐ విజయేందర్, రమేష్, హెడ్‌కానిస్టేబుల్ ముత్తయ్య, బాలకృష్ణ, సిబ్బంది కొనుగోలుదారులు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు

పాల్వంచ, ఏప్రిల్ 26: బెల్టు షాపు నిర్వహకుడిపై పాల్వంచ రూరల్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పాల్వంచ మండలం పుల్లాయిగూడెంలోని లెనిన్ కుమార్ షాపులో దాడి చేసిన పోలీసులు 18 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.

మే 3నుంచి హోమ్ ఓటింగ్

- 80ఏళ్లు దాటిన వృద్ధులకు, దివ్యాంగ ఓటర్లకు అవకాశం
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 26: వృద్ధులు, దివ్యాంగులు ఇంటినుంచి ఓటు హక్కు వినియోగించుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) మార్గదర్శకాలు జారీచేసింది. 80 ఏళ్లు దాటిన వృద్ధులు, 40శాతానికి మించి అంగవైకల్యం ఉన్న దివ్యాంగులు కోరుకున్న పక్షంలో ఇంటినుంచి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించారు. ఇందుకోసం నామినేషన్ల దాఖలు ప్రారంభానికి 5రోజుల ముందుగానే ఎన్నికల అధికారులకు 12డీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. పోలింగ్ కేంద్రం స్థాయి అధికారి (బీఎల్వో) అర్హుల అందరి ఇళ్లకు వెళ్లి గుర్తించారు. ఆయా దరఖాస్తులను నియోజకవర్గ అధికారి ఆమోదముద్రతో పోస్టల్‌బ్యాలెట్ ముద్రణను ఎన్నికల సంఘానికి పంపుతారు.

సాధారణ పోలింగ్ తేదీ కన్నా ముందుగానే.. పోలింగ్ కేంద్రం స్థాయి అధికారి బ్యాలెట్ పత్రాలు, సంబంధిత కవర్లను తీసుకుని ఓటర్ల ఇంటికి వెళతారు. అక్కడ ఓటరు రహస్యంగా తన హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక కంపార్టుమెంట్ ఏర్పాటు చేస్తారు. ప్రత్యేకంగా వీడియోగ్రఫీ నీడన ఈ ఓటింగ్ ప్రక్రియను చేపట్టనున్నారు. మే 3 నుంచి పార్లమెంట్ పరిధిలో ఏడు సెగ్మెంట్లలోనూ ఈ ఓటింగ్‌ను ప్రారంభించనున్నారు. ఒకసారి పోస్టల్ బ్యాలెట్‌కు అనుమతి పొందిన వారు, పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసేందుకు అవకాశం ఉండదు.

2935 మంది వృద్ధులు

ఖమ్మం పార్లమెంట్ పరిధిలో ఏడు సెగ్మంట్లలోనూ 80ఏళ్లు దాటిన వృద్ధులు 9067 మంది ఉన్నారు. వారిలో వంద సంవత్సరాలు దాటిన వారూ ఉన్నారు. దివ్యాంగ ఓటర్లు మరో 30,915 మంది. ఉన్నారు. రాష్ట్రంలో నాగార్జునసాగర్, మునుగోడు ఉపఎన్నికల సందర్భంగా వృద్ధులకు ఇంటినుంచి ఓటు వేసే విధానాన్ని అమలు చేసిన విషయం తెలిసిందే. దుబ్బాక ఉపఎన్నికలో కూడా వృద్ధులతో పాటు. కొవిడ్ బాధితులకు సైతం ఈ అవకాశాన్ని కల్పించారు. దీంతో ఈ ఎన్నికల్లో 2935 మంది ఫాం 12డీలో దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ మే 3నుంచి ఇంటికి వెళ్లి ప్రత్యేక బృందాల సహాయంతో ఓట్లు వేయనున్నారు.

పార్టీలకు, అభ్యర్థులకు సమాచారం

ఈ సౌకర్యాన్ని వినియోగించుకునే ఓటర్ల వివరాలను రాజకీయ పార్టీలు, నియోజకవర్గ అభ్యర్థులకు ముందుగానే అందజేస్తారు. వారి పోలింగ్ సమయంలో పార్టీలు, అభ్యర్థుల ప్రతినిధులు అక్కడికి హాజరయ్యేందుకు సీఈసీ అనుమతించింది. నియోజకవర్గ సూక్ష్మ పరిశీలకుడు పాల్గొంటారు. ఈ ప్రక్రియను అంతా వీడియో తీస్తారు. ఓటింగ్ పూర్తయ్యాక ఆయా కవర్లను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచి, పోస్టల్ ఓట్లతో జతచేసి లెక్కిస్తారు.

బాలిక అదృశ్యం

పాల్వంచ, ఏప్రిల్ 26: బాలిక అదృశ్యమైన ఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం పాల్వంచ పట్టణ పరిధిలోని శ్రీనివాస కాలనీకి చెందిన ఓ మైనర్ బాలిక (17) స్థానికంగా ఇంటర్ చదువుతుంది. ఇంటర్‌లో కొన్ని సబ్జెక్టులలో ఫెయిల్ అవడంతో ఉదయం ఇంట్లో సప్లమెంటరీ ఫీజు కట్టి వస్తానని చెప్పి బయటకు వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి ఆచూకీ కోసం గాలిస్తున్నామని టౌన్ ఎస్ఐరాము తెలిపారు.

న్యాయాధికారులకు ఘనంగా వీడ్కోలు

ఖమ్మంలీగల్, ఏప్రిల్26: శుక్రవారంసాయంత్రం కోర్టు ఆవరణలో న్యాయా. దికారుల వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ళ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బదిలీ అయిన జిల్లా ప్రధాన న్యాయాధికారి బి.ఎస్.జగ్జీవన్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. న్యాయవాదుల, న్యాయశాఖ ఉద్యోగుల సహకారం మరవలేనిదని అన్నారు. బదిలీ అయిన న్యాయాధికారులు బి.ఎస్. జగ్జీవన్‌కుమార్, కె.ఆశా రాణి, అబ్దుల్ జావీద్‌పాషా, పి.గోపికా నాగశ్రావ్య, అన్నారపు రవిశంకర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు, బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతనిప్పు వెంకట్, కార్యవర్గం పాల్గొన్నారు.



ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీకి చెందిన మిలిషియా కమాండెంట్‌తోపాటు దళసభ్యురాలు భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ సమక్షంలో శుక్రవారం లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా నెమలిగుడా గ్రామానికి చెందిన మిలిషియా కమాండెంట్ పొడియం పిడిమయ్య అలియాస్ హరీష్, ఉయికే ముత్యాలక్క లొంగిపోయారు. 2011 నుంచి మావోయిస్టు మిలిషియా సభ్యులుగా పని చేస్తు ఉన్న పొడియం పిడిమయ్య 2022 సంవత్సరంలో నెమలిగుడా ఆర్పీసీ మిలిషియా కమాండర్‌గా నియమితులయ్యారు. అదే ప్రాంతానికి చెందిన ఉయికే ముత్యాలక్కను కమిటీలో చేర్పించుకుని మావోయిస్టు పార్టీ ప్రచారంలో పాల్గొంటున్నారు. ప్రజలను బెదిరిస్తూ ఆదివాసీ బాలికలను మావోయిస్టు పార్టీలో చేర్పిస్తున్నారు. భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్ నిర్వహిస్తున్న ఆపరేషన్ చేయూత కార్యక్రమానికి ఆకర్షితులైన ఇరువురు మావోయిస్టులు స్వచ్ఛందంగా పోలీసుల ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన



వివరాలను వెల్లడిస్తున్న భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్

మావోయిస్టులకు ప్రభుత్వపరంగా వచ్చే సదుపాయాలను కల్పిస్తామని పోలీసులు తెలిపారు. జనజీవన స్రవంతిలో కలిసే మావోయిస్టులకు పోలీసులు అండగా ఉంటారని, లొంగిపోదల్చుకున్న మావోయిస్టులు తమ సమీప బంధువుల ద్వారా సంబంధిత పోలీస్ అధికారులతో లొంగిపోయే అవకాశం ఉందని విజ్ఞప్తి చేస్తున్నారు.

రహదారి పై రగడ..

- రహదారిని మూసివేసిన అటవీశాఖ అధికారులు...
- మునిసిపల్ కమిషనర్‌కు సీపీఐ నాయకుల ఫిర్యాదు

పాల్వంచ, ఏప్రిల్ 26: అది ఏళ్ల తరబడి పాల్వంచ వాసులు వినియోగిస్తున్న రహదారి ఫారెస్ట్ ఆఫీస్ రోడ్. కానీ శుక్రవారం ఆ రహదారిని అటవీశాఖ అధికారులు బారికేడ్లతో మూసివేశారు. ఈ చర్యలతో పాదచారులు వేరే మార్గాలను ఎంచుకోవాల్సి వచ్చింది. పాల్వంచలోని వివిధ ప్రాంతాల నుంచి మార్కెట్‌కు వచ్చే వారు, రాంనగర్ వాసులు ఎక్కువగా ఈ ఫారెస్ట్ ఆఫీస్ రోడ్‌ను వినియోగిస్తుంటారు. ముఖ్యంగా బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలకు పనిమీద వచ్చే వారు, వెళ్ళేవారు ఈ రహదారిని వినియోగిస్తుంటారు. కానీ అటవీశాఖ అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేయడంతో వారు నానా అవస్థలు పడుతున్నారు. అటవీశాఖ అధికారుల చర్యలపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడం, తమ సమస్యపై చొరవ తీసుకోవాలని వారు సీపీఐ నాయకులను కలవడంతో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాధం ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్ స్వామిని కలిశారు. అటవీశాఖ అధికారుల తీరుపై అధికారికి ఫిర్యాదు చేసి వినతిపత్రం అందించారు. బారికేడ్లు తొలగించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు సీపీఐ సిద్ధపడుతుందని హెచ్చరించారు. ముత్యాల విశ్వనాధం మాట్లాడుతూ రహదారిని మూసివేయడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారని అన్నారు.



అటవీశాఖ అధికారులు బారికేడ్లతో మూసివేసిన రహదారి

మునిసిపల్ అధికారులు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రహదారిని తక్షణమే పునరుద్ధరించాలని, లేని పక్షంలో కలెక్టర్, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకువెళ్ళి ప్రజల పక్షాన పోరాడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబా, నాయకులు బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, దుగ్గిరాల సుధాకర్, పద్మజ, శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, గాలి పద్మ, లక్ష్మి, పాషా, జకర్యా, గిరి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రామకృష్ణ, స్థానికులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి కూరగాయల వ్యాపారుల ఆర్థిక సాయం

భద్రాచలం, ఏప్రిల్ 26: మేడ్చల్ సీఎంఆర్ వైద్య కళాశాలలో వైద్య విద్య అభ్యసిస్తున్న బూర్గంపాడు మండలంలోని సారపాకకు చెందిన పి అమృత సాయికి కూరగాయల మార్కెట్ వ్యాపారులు ఆర్థిక సహాయం అందజేశారు. ప్రస్తుతం అమృతసాయి ప్రథమ సంవత్సరం విద్యనభ్యస్తిన్నారు. విద్యార్థి తండ్రి నిరుపేద కావడంతో కూరగాయ వ్యాపారులు ఉన్నత విద్యకోసం రూ.15వేలు అందజేశారు. ఈ మొత్తాన్నివిద్యార్థిని తండ్రి తిరుమల రావుకు వారు అందజేశారు. ఆర్థిక సహాయం అందజేసిన వ్యాపారులకు తండ్రి తిరుమల రావు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దాతలు పాత మార్కెట్ కు చెందిన వ్యాపారులు సిహెచ్ సత్యనారాయణ, పసుపులేటి రామకృష్ణ, పసుపులేటి శ్రీనివాస రావు, వసుధ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఇల్లు కూల్చివేత వివాదంపై కేసు నమోదు

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 26: ఇల్లు కూల్చివేత వివాదంపై ఖమ్మం ఖనాపురం హవేలీ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీ రోడ్ నెంబర్ 15లో ఓ స్థల విషయంలో అదే ప్రాంతానికి చెందిన చేపూరి పద్మకు వాసిరెడ్డి శ్రీనివాస్, కోన గోవిందరావులకు మధ్య కొంతకాలంగా వివాదం జరుగుతుంది. ఈ ఘటనపై వారు కోర్టును కూడా ఆశ్రయించారు. ఈ క్రమంలో పద్మ నివాసంలోకి గోవిందరావు, శ్రీనివాస్ వెంకటేశ్వర్లతో పాటు మరికొందరు శుక్రవారం అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యం చేశారు. ఇంటిని కూల్చి, ఇంట్లోనే వస్తువులను పగలగొట్టడంతో పాటు పద్మను ఆమె కుమార్తెను దుర్భాషలాడుతూ అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో పద్మ కుమార్తె అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి వారు విచారణ చేస్తున్నారు.

లారీ ఢీ.. మహిళ మృతి



మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 26: బంధువుల వివాహానికి వెళ్లడానికి బయలుదేరిన మహిళ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. సూర్యాపేట జిల్లా, కోదాడ మండలం, గోల్‌తండాకి చెందిన బానోత్ భూరి(58) గురువారం కూసుమంచి మండలం, గోరీలపాడుతండాలోని తమ సోదరి బానోత్ బుజ్జి ఇంటికి వచ్చింది. ఇద్దరు కలిసి శుక్రవారం ఏన్కూర్‌లో వివాహానికి వెళ్లేందుకు బయలుదేరారు. ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్డుకి చేరుకున్నారు. కరీంనగర్ నుంచి ఏన్కూర్ వెళ్లే పెండ్లి బస్సుకోసం ఎదురు చూస్తున్నారు. భూరి మూత్ర విసర్జనకోసమని వరంగల్‌క్రాస్‌రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపునుంచి వస్తున్న లారీ అతివేగంగా వచ్చి ఢీకొంది. లారీ టైర్లు భూరి పైనుంచి వెళ్లడంతో భూరి అక్కడికక్కడే మృతి చెందగా, మృతదేహం రోడ్డుకు అతుక్కుపోయింది. మృతదేహన్ని పారా లీగల్ వలంటీర్ అన్నం శ్రీనివాస్ సేవా బృందం సహాయంతో పోలీసులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వయోభారంతో వృద్ధుడి ఆత్మహత్య

కామేపల్లి, ఏప్రిల్ 26: వయోభారంలో అనారోగ్యం కారణంగా ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కామేపల్లి మండల కేంద్రంలో చోటు శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు కామేపల్లికి చెందిన సత్యనారాయణచారి(70) వయోభారానికి తోడు అనారోగ్యం సమస్యలు ఉండడం కారణంగా మనోవేదనతో ఇంట్లో ఉరిపెట్టుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

స్నేహితుడి చెల్లి పెళ్లికి వెళ్లి మృత్యువాత

● ఈతకు వెళ్లి బీఫార్మసీ విద్యార్థి మృతి ● అంబేద్కర్‌నగర్‌లో విషాదం



అకీరానందన్(ఫైల్)

తల్లాడ, ఏప్రిల్ 26: సూర్యాపేట జిల్లా మటంపల్లి మండలం అల్లీపురం గ్రామంలో శుక్రవారం ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తూ బావిలో నీటమునిగి ఖమ్మంజిల్లా తల్లాడ మండలం అంబేద్కర్‌నగర్‌కు చెందిన బీ ఫార్మసీ విద్యార్థి వేము అకీరానందన్ (20)మృతిచెందా డు. అకీరానందన్ అకా ల మృతితో అంబేద్కర్‌నగర్‌లో విషాదం అలుముకుంది. అంబేద్కర్‌నగర్ నుంచి అకీరానందన్, అక్షయ్ కలిసి అల్లీపు రం గ్రామంలో జరిగే తమ స్నేహితుడి చెల్లి పెళ్లికి వెళ్లారు. శుక్రవారం ఉదయం పెళ్లి ఇంట్లోనే టిఫిన్ చేసిన అనంతరం స్నానం చేసేందుకు స్నేహితులతో కలిసి సమీపంలో ఉన్న వ్యవసాయ బావి వద్దకు అకీరానందన్ వెళ్లాడు. ఈత కొట్టేందుకు బావిలోకి దిగిన వెంటనే నీట మునిగి అకీరానందన్ మృతిచెందాడు. 40అడుగుల లోతు నీరున్న బావిలోని అకీరా నందన్ మృతదేహాన్ని విద్యుత్ మోటార్ల సహాయంతో నీటిని బయటకు తోడి వెలికితీశారు. అంబేద్కర్‌నగర్‌కు చెందిన వేము రాజు, తేరేజమ్మ దంపతుల కుమారుడు అకీరానందన్ కోదాడలో బీఫార్మసీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీపనులు చేస్తూ ప్రతిభావంతులైన అకీరానందన్ ను బీ ఫార్మసీ, చెల్లి అక్షయను సీఏ చదివిస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కామేపల్లి, ఏప్రిల్ 26: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కామేపల్లి మండల మద్రిగూడెంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఏన్కూర్ మండలం టీఎల్‌పేటకు చెందిన రాయల నాగారాజు(38) తన కూతురును పెనుబల్లి హాస్టల్ నుంచి మూడో రోజుల క్రితం ద్విచక్రవాహనంపై తీసుకొని వస్తుండగా మద్రిగూడెం సమీపంలో బైక్ అదుపు తప్పి పడడంతో నాగరాజు తలకు తీవ్రంగా గాయాలు అయ్యాయి. చికిత్స పొందుతు శుక్రవారం మృతి చెందాడు. మృతుడు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం నాగరాజు మద్రిగూడెం నివాసం ఉంటున్నాడు.

పచ్చని చెట్లు అగ్నికి బుగ్గి

- హరితహారంలో నాటిన చెట్లకు నిప్పుపెడుతున్న రైతులు
- నీడపడితే పంట పండదని అన్నదాతల ఆలోచన
- రూ. లక్షలు వృథా
- పట్టించుకోని అధికారులు



బాలపేట వద్ద కాలిపోయిన మొక్కలు

తల్లాడ, ఏప్రిల్ 26: స్వచ్ఛమైన ప్రాణవాయువు, వాతావరణ సమతౌల్యం సమృద్ధిగా వానలు కురిసేందుకుగానూ పెంచుతున్న చెట్లు కొందరు వ్యక్తుల స్వార్థపు అగ్నికి బుగ్గవుతున్నాయి. హరితహారం పథకం కింద నాటి పెంచి పోషిస్తున్న మొక్కలు, చెట్లను తమ పొలాలకు నీడబారితే పంటల దిగుబడులు తగ్గుతాయని భావించి కొందరు వ్యక్తులు పథకం ప్రకారం మొక్కలు, చెట్ల మొదళ్ల వద్ద చెత్తవేసి నిప్పంటించడంతో పచ్చని చెట్లు నిలువునా మంటల్లో కాలిబూడిదవుతున్నాయి. 2015 జూన్‌లో ప్రారంభించిన తెలంగాణ హరితహారం కార్యక్రమంలో భాగంగా 8విడతలుగా నిర్వహించిన హరితహార కార్యక్రమంలో తల్లాడ మండలంలోని 27గ్రామపంచాయతీల్లో ఖాళీగా ఉన్న





ప్రభుత్వస్థలాలు, నాగార్జున్‌సాగర్ ప్రాజెక్టు(ఎన్నెస్పీ) కాల్వ గట్లు, రహదారులకు ఇరువైపులా వేలాదిగా మొక్కలు నాటారు. ఉపాధి హామీ పథకం నిధులతో కమ్యూనిటీ, అవెన్యూ ప్లాంటేషన్ల ద్వారా మొక్కలు నాటారు. కమ్యూనిటీ ప్లాంటేషన్ ద్వారా మొక్కల కొనుగోలుకు ఒక్కో మొక్కకు రూ.20నుంచి రూ.50, మొక్కల సంరక్షణ, నిర్వహణ కోసం ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు కలిగిన కూలీలను వాచర్లుగా నియమించి ఒక్కో మొక్కకు నెలకు రూ.ఐదు చొప్పున 24నెలలపాటు వాచర్లకు వేతనం చెల్లించటం జరుగుతుంది. అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా ఒక్కో మొక్కకు రూ.150నుంచి రూ.300 ధరకు నర్సరీల్లో కొనుగోలు చేసి మొక్కకు నెలకు రూ.15చొప్పున 36నెలలపాటు వాచర్లకు వేతనంగా చెల్లించారు. పంచాయతీల ఆధ్వర్యంలో మొక్కలు పెంచి వృద్ధి చేశారు. ప్రస్తుతం మొక్కలు, చెట్ల సంరక్షణ, నిర్వహణ బాధ్యతను ఉపాధి హామీ పథకం నుంచి గ్రామపంచాయతీలకు బదలాయించారు. ఖరీఫ్, యాసంగి వ్యవసాయ సీజన్ పంట కాలం ముగియడంతో కొందరు వ్యక్తులు తమ పొలాల సమీపంలోని పచ్చని చెట్లను తొలగించేందుకు పొలాల్లోని చెత్తను చెట్ల మొదళ్లలో వేసి నిప్పంటిస్తూ చెట్లను బుగ్గిచేస్తున్నారు. దీంతోపాటు సామాజిక అటవీ పథకం ద్వారా జాతీయ, రాష్ట్రీయ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లకు ఇరువైపులా పెంచిన భారీ వృక్షాలను సైతం నిప్పంటించి బుగ్గి చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పచ్చని చెట్లను బుగ్గికాకుండా నివారణ, రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రైల్వేలైన్‌కు భూములిచ్చేదిలేదు..

- రైతులకు తెలియకుండానే సర్వే ఎలా చేస్తారు..?
- దోర్నాకల్-గద్వాల రైల్వేలైన్ సర్వేపనులు నిలిపివేయాలని రైతుల ఆందోళన
- కూసుమంచి, తిరుమలాయపాలెంలో నిరసన



కూసుమంచి మండలం చేగొమ్మ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

కూసుమంచి/తిరుమలాయపాలెం ఏప్రిల్ 26: భూములు కోల్పోతున్న రైతులకు సమాచారం ఇవ్వకుండా సర్వే ఎలా చేస్తారని రైతులు రైల్వేలైను అధికారులను అడ్డుకున్నారు. డోర్నకల్ - గద్వాల రైల్వేలైన్ పనులు నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రైతులు ఆందోళన నిర్వహించారు. జుజ్జులరావుపేట గ్రామ సమీపంలో రైల్వేలైన్‌కు సంబంధించి కొందరు సర్వే పరికరాలతో సర్వేచేసి మార్కింగ్ ఇస్తుండగా జుజ్జులరావ ుపేట గ్రామానికి చెందిన కొందరు రైతులు అడ్డుకున్నారు. భూములు కోల్పోతున్న రైతులకు సమాచారం ఇవ్వకుండా ఎలా సర్వే చేస్తారని ప్రశ్నించారు. అదేవిధంగా చేగొమ్మ గ్రామం సమీపంలో బాధిత రైతులు సమావేశమై అధికారులు మార్కింగ్ ఇచ్చిన ప్రాంతంలో రైతులు పెద్ద సంఖ్యలో చేరుకుని ఆందోళన నిర్వహించారు. రైల్వే అధికారులకు, ప్రభుత్వనికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈప్రాంతంలో అందరూ సన్న, చిన్నకారు రైతులేనని తెలిపారు. తమ విలువైన భూములను రైల్వేలైనుకు ఇచ్చే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. రైల్వేలైను తమకు గుదిబండలా మారుతుందని వాపోయారు. భూమిని నమ్ముకుని వ్యవసాయం చేస్తున్నామని, ఇప్పుడు భూమిపోతే తమ జీవనోపాధి ఎలా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బలవంతంగా భూములు లాక్కొని నిర్మాణం చేపడితే విపత్కర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆందోళనలో చింతలపూడి శ్రీనివాసరావు, సుడిగాలి రామచంద్రయ్య, చీమలదారు ఉపేందర్, కుక్క సురేష్, కొండపర్తి కమలాకర్, అంబాల వెంకట్రాములు, నర్ర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కొత్త రైల్వేలైన్ మాకొద్దంటూ రైతుల నిరసన

తిరుమలాయపాలెం;: డోర్నకల్-గద్వాల రైలుమార్గం కోసం అధికారులు ఇటీవల మార్కింగ్ పనులు చేపడుతున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం మండలంలోని కొక్కిరేణి, ఎర్రగడ్డ, గోపాలపురం, ఖమ్మంరూరల్ మండలం చింతపల్లి, ఆరెకోడు గ్రామాల రైతులు కొత్త రైల్వే లైన్ మాకొద్దంటూ ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా తిరుమలాయపాలెం, కొక్కిరేణిగ్రామాల సమీపంలో జాతీయ రహదారి పక్కన ఎస్‌టీపీ 111 మార్కింగ్ వద్ద రైతులు సమావేశం నిర్వహించిన అనంతరం ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముత్యం ఉప్పలరావు, ఇంటూరి వెంకటేశ్వర్లు, చావా వెంకటరావు, మల్లెల వెంకటనారాయణ, పాపారావు, ఉప్పగండ్లప్రసాద్, తోట శ్రీనివాసరావు, బెల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం రైతులకు రుణాలు: జిల్లా మేనేజర్ భారతి

సత్తుపల్లి, ఏప్రిల్26: అర్హులైన ఆయిల్‌పాం రైతుల రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయిల్‌ఫామ్ జిల్లా మేనేజర్ భారతి కోరారు. శుక్రవారం స్థానిక అయ్యగారిపేటలోని సత్తుపల్లి బ్రాంచ్ వద్ద సత్తుపల్లి, అశ్వారావుపేట, దమ్మపేట ఏరియాలలో ఆయిల్‌ఫామ్ సాగు చేస్తున్న రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. సాగు వినియోగానికై అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయుట, ఆయిల్‌ఫామ్ సాగు విధివిధానాలపై సూచనలు, సలహాలు అందజేశారు. ఆయిల్‌పాం సాగుచేసిన ఏరియా పరిధిలోని అయిల్‌పామ్ కంపనీలు వారితో ట్రై-పార్టీ అగ్రిమెంట్ చేసుకొని నగదు ఏ బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నారో అట్టివారికి డీసీసీబీ ద్వారా రుణాలు మంజూరు చేస్తామని డీసీసీ సత్తుపల్లి నోడల్ ఆఫీసర్ (ఏజీఎం) అజయ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ మేనేజర్లు ఎం.రజిత, డీ.రాకేష్, రైతులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులను సమర్థంగా నిర్వహించాలి

ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి

ముదిగొండ, ఏప్రిల్26: ఎన్నికల విధులను సమర్థంగా నిర్వహించాలని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి సూచించారు. శుక్రవారం ముదిగొండ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సెక్టార్ అధికారుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా విధులు నిర్వహించాలన్నారు. తోటి అధికారులను సమన్వయం చేసుకొని పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సమావేశంలో సీఐ రాజిరెడ్డి, ఎస్ఐ నరేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెట్టింది

జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

బోనకల్, ఏప్రిల్ 26: మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక తన నిజ స్వరూపాన్ని చూపుతుందని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ ఆరోపించారు. మండలంలోని రాయనపేట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పాలకులు ఎంపీ ఎన్నికల్లో డబ్బులు ఎర చూపి ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఇప్పటికే ప్రభుత్వం పట్ల వ్యతిరేకత మొదలైందన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు జంగా రవి, వేమూరి ప్రసాద్, మల్లికార్జున్, నాగేశ్వరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

రఘురాంరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించండి

ఖమ్మంచర్చికాంపౌండ్,ఏప్రిల్ 26: ఖమ్మం కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ కోరారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసంలో కొరిపల్లి శ్రీనివాస్‌మాదిగ కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డిని కలిసి దండోరా డప్పును బహూకరించారు.

ఎన్నికల నేపథ్యంలో విస్తృత తనిఖీలు: సీపీ

ఖమ్మం క్రైం,ఏప్రిల్26: నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణ లక్ష్యంగా కమిషనరేట్ పరిధిలో పోలీసులు విస్తృత తనీఖీలు నిర్వహిస్తున్నట్టు పోలీస్ కమిషనర్ సునిల్‌దత్ శుక్రవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. సరిహద్దు ప్రాంతాలతో పాటు నగరంలో రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనీఖీ చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకుతనీఖీలలో రూ.100,59,130 నగదు, రూ.11,47,000 లక్షల విలువ చేసే 44కేజీల గంజాయిని కూడా ను సీజ్ చేశామని తెలిపారు. తనీఖీలు చేస్తున్న పోలీసులకు ప్రజలు సహకరించాలని సీపీ ప్రకటనలో తెలిపారు.

ఉపాధి కూలీలకు రూ.600 ఇవ్వాలి

తిరుమలాయపాలెం,ఏప్రిల్26: ఉపాధి కూలీలకు కొలతతో సంబంధం లకుండా రూ.600 చెల్లించాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బచ్చోడులో ఉపాధి కూలీలు చేపడుతున్న పని ప్రదేశాన్ని సందర్శించారు. ఈకార్యక్రమంలో ఉప్పలయ్య, లింగయ్య , నాగమణి, సోమమ్మ, వెంకటమ్మ, అచ్చమ్మ పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

తిరుమలాయపాలెం,ఏప్రిల్26: తిరుమలాయపాలెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10:30గంటలకు జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. ఈసమావేశానికి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రచార రథాలు సిద్ధం



వైరా, ఏప్రిల్26: వైరా నియోజక వర్గంలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారానికి వాహను (రథాల) సిద్ధం చేశారు. ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా రామసహాయం రఘురామిరెడ్డి గురువారం నామినేషన్ వేసిన వెంటనే యుద్ధప్రాతిపదికన అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా ఎన్నికల ప్రచార రథాలను సిద్ధం చేశారు. శుక్రవారం సిద్ధమైన ప్రచార వాహనాలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి సమీపంలోని కూరగాయల మార్కెట్ వద్ద నిలిపి ఉంచారు. దాదాపు 8వాహనాలను సిద్ధం చేశారు. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు ప్రచార వాహనాలు గ్రామాల్లో తిరుగుతూ విస్తృతంగా ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. ఇక కాంగ్రెస్ వాహనాల రాకతో ప్రచారం ఊపందుకోనుంది.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ ఫ్లాగ్‌మార్చ్

రఘునాథపాలెం, ఏప్రిల్ 26: ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రఘునాథపాలెం సీఐ శ్రీహరి కోరారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలైన రఘునాథపాలెం, ఈర్లపూడి, చింతగుర్తిలో సీఐ శ్రీహరి ఆధ్వర్యంలో శుక్రవారం పోలీస్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. గ్రామాల్లో పోలీసు బలగాలు ర్యాలీ నిర్వహించి ప్రజలకు రక్షణ భరోసా కల్పించారు.

మండుటెండలో తుమ్మల పర్యటన



నాభిశిల ఉత్సవంలో మంత్రి తుమ్మల

ఖమ్మంసంక్షేమవిభాగం/రఘునాథపాలెం, ఏప్రిల్26: మండే ఎండల్లోను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నియోజకవర్గంలో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. పుట్టకోటలో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజాకార్యక్రమాల్లో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. స్థానికులు ఘన స్వాగతం పలికారు. దేవాలయంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇటీవల డెంగీ జ్వరానికి గురై హైదరాబాద్‌లో చికిత్స తీసుకొని కొలుకోని ఇంటికి చేరుకున్న 15వ డివిజన్ కార్పొరేటర్ రావూరి కరుణను పరామర్శించారు. నివాసానికి వెళ్లినతుమ్మల నాగేశ్వరరావు యోగక్షేమాలు తెలుసుకున్నారు. శుక్రవారం రావూరి కరుణ పుట్టిన రోజు కావటంతో జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాంక్యా తండాలో నాభిశిల మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ఖమ్మం మార్కెట్ కమిటీ సీనియర్ నాయకులు నున్నా మాధవరావును నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. వీవీపాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదబాబు, కార్పొరేటర్లు కమర్తపు మురళి, నాయకులు సాధు రమేశ్‌రెడ్డి, చావా నారాయణరావు, ఆళ్ల అంజిరెడ్డి, తుంపాల కృష్ణమోహన్, దిరిశాల వెంకటేశ్వర్లు, నల్లమల ఆనంద్, గుత్తా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నెలరోజులుగా అందని 'ఉపాధి' కూలి

- పేరువంచలో ఉపాధి హామీ కూలీల అవస్థలు
- పనుల ప్రదేశంలో అరకొరగా సౌకర్యాలు



నగదు అందలేదంటున్న ఉపాధి కూలీలు

కల్లూరు, ఏప్రిల్26: మండలంలోని పేరువంచ గ్రామంలో ఉపాధి కూలీలకు నెలరోజులుగా కూలీ అందటం లేదు. మరో వైపున గత ఏడాది చేసిన పనులకు కొందరికి కూలీ అందలేదని చెబుతున్నారు. పేరువచం గ్రామంలోని చిల్లంపల్లి చేరువు పరిధిలో మట్టి పనులకు ఈ సీజన్‌లో సుమారు 200 మంది ఉపాధి పనులకు వస్తున్నారు. వీరంతా పేరువంచ, ఎస్టీఆర్ కాలనీలకు చెందిన వారు. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు మాత్రమే ఆ చెరువులో మట్టి పనులు చేయగా సగటున రోజుకు రూ.300 లోగా కూలీ నగదు గిట్టుబాటు అవుతుందని తెలిపారు. కానీ పనులు చేసినప్పటి నుంచి నేటి వరకు కూలీ నగదు అంద లేదని ఉబ్బన లక్ష్మీసరస్వతి, వెలిశాల విజయ, సుబ్బారావు, ఉబ్బన సుధాకర్, మట్టెల రాఘవమ్మ, మంగంమ్మ తదితరులు ఆంధ్రజ్యోతికి తెలిపారు. పనుల ప్రదేశంలో అరకొరగా మాత్రమే మంచినీటి, నిలువ నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేశారని వారు వివరించారు. ఈ ఏడాది వ్యవసాయ సీజన్ అనుకూలించక పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని. ఈ నేపథ్యంలో ఉపాధి పనులకు వెళ్తే కూలీ నగదు వస్తుందని ఎంతో ఆశ పడగా చివరకు నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది క్రితం పేరువంచ ఊరచెరువు పరిధిలో చేసిన పనులకు కూడా 21 రోజులకు సంబంధించి 25 మంది కూలీలకు కూలీ నగదు అందాల్సి ఉందన్నారు.

కాలిపోయిన చెట్టును తొలగించిన అధికారులు



చెట్టును తొలగిస్తున్న అధికారులు

కొణిజర్ల,ఏప్రిల్26:రైతులు చేలల్లో చెత్తకు నిప్పంటించడం వలన కాలుకుంటూ వస్తూ రోడ్డుప్రక్కన ఉన్న పెద్దపెద్ద చెట్లు మొదళ్ల కాలి నేలమట్టమవుతున్నాయి. కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపంలో రోడ్డుప్రక్కన ఉన్న పెద్దచెట్టు చేలల్లో నిప్పంటించడంతో కాలుకుంటూ వచ్చి చెట్టుమొదలు కూడ కాలిపోయింది. దాంతో చెట్టుకాస్త మొదలుకాలటంతో రోడ్డుపై పడింది. ఆ సమయంలో ఎవరూ రోడ్డుపై ప్రయాణించకపోవడంతో ప్రమాదం తప్పింది. ఎంపీవో ప్రభాకర్‌రెడ్డి, తనికెళ్ల గ్రామ పంచాయతీ సెక్రటరీ మురళీకృష్ణ పంచాయతీ సిబ్బందితో కలిసి ట్రాక్టర్ ద్వారా రోడ్డుపై పడిన చెట్టును తొలగించారు.

చెత్తను కాల్చకండి: ఎంపీవో ప్రభాకర్‌రెడ్డి

రైతులు పంట అయిన తర్వాత పత్తి, ఇతర పంటల మొక్కలను కాల్చ వద్దని ఎంపీవో ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రోడ్డుప్రక్కన పచ్చని చెట్లు నిర్లక్ష్యం వలన కాలిపోతున్నాయన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా గ్రామాలలో కూడ మైక్ చెప్పిండంతో జరుగుతుందని తెలిపారు. రైతులు అర్థం చేసుకొని జాగ్రత్తలు లేకుండ చేలల్లో నిప్పు పెట్టవద్దని హెచ్చరించారు.

ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



రత్నాకర్



సైదులు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 26: తెలంగాణ ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బాబూ రత్నాకర్, కార్యదర్శిగా సైదులు, కోశాధికారిగా రాజశేఖర్, సభ్యుడిగా కృపాఉషశ్రీ, బొలికొండ శ్రీనివాసరావు, బి.బాలు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా రామూనాయక్, వేణు మాధవ్, సుజన, జాయింట్ సెక్రటరీగా శ్రీదేవి, పి.రవికుమార్, కె.ప్రేమజ్యోతి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు. ప్రభుత్వ వైద్యుల సంక్షేమం కోసం పని చేస్తామని ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు తెలిపారు.

సత్తుపల్లి, తల్లాడలో నేడు విద్యుత్ సరఫరా బంద్

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్26: సత్తుపల్లిలోని 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శరత్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తుపల్లి టౌన్-2 పరిధిలోని కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతల నేపథ్యంలో కల్పతరువు రోడ్, మహాత్మాగాంధీ రోడ్‌లలో సరఫరాను ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు నిలిపి వేస్తున్నామని, ఏఈ కోరారు.

తల్లాడ: మిట్టపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 7నుంచి 11గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని కుర్నవల్లి ఏఈ సుందర్‌కుమార్ తెలిపారు. మిట్టపల్లి,నూతనకల్, వెంగన్నపేట, రంగంబంజర, నారాయ్య బంజర, మల్సూర్‌తండా,రామానుజవరం,లక్ష్మీపురం, పినపాక, వెంకటాపురం గ్రామాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

బోన్‌మ్యారో చికిత్సతో తలసీమియాకు ఉపశమనం

వైద్యులు విజయ్, నారాయణమూర్తి

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 26: తలసీమియాతో బాధపడుతున్న చిన్నారులకు బోన్‌మ్యారో సర్జరీతో ఉపశమనం కల్పించవచ్చని ప్రముఖ వైద్యులు ఎం.విజయ్, డి.నారాయణమూర్తి అన్నారు. మహబూబాబాద్ జిల్లా నరసన్నపేటకు చెందిన జి.వీక్షిత్ (హెచ్ఎల్ఏ హాఫ్ మ్యాచ్), ఖమ్మానికి చెందిన జె.రూహీ(హెచ్ఎల్ఏ ఫుల్ మ్యాచ్) చిన్నారులకు బోన్‌మ్యారో చికిత్స విజయంతంగా పూర్తిచేసుకుని గురువారం ఖమ్మం వచ్చారు. ఈసందర్భంగా వారికి సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. సంస్థ బాధ్యులు రవిచందర్ మాట్లాడుతూ బెంగుళూర్ సంకల్ప్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో తమ సంస్థ చిన్నారులకు బోన్‌మ్యారో చికిత్స చేయిస్తోందని, ఇప్పటి వరకు 8మంది చిన్నారుచుచితంగా చికిత్స అందించామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, పి.ఉదయ్‌భాస్కర్, పి.అనిత, ఎన్.ఉపేందర్ పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంస్పోర్ట్స్, ఏప్రిల్26: జిల్లాయువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నగరంలోని సెట్‌కం కార్యాలయంలో నిర్వహిస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల కాల పరిమితి కలిగిన ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్, బ్యూటీషియన్, రిఫ్రిజేటర్ ఏసీ మెకానిజం తదితర కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. మే 1 నుంచి ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. ఇతర సమాచారం కోసం సర్దార్ పటేల్ స్టేడియంలోని సెట్‌కం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ప్రజల సేవలో సత్య సాయి సేవాసమితి



నేలకొండపల్లి, ఏప్రిల్26: భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి ప్రజల సేవలో ముందుకెళుతోందని సేవాస మితి కన్వీనర్ గెల్లా వెంకటరమణ గుప్తా పేర్కొన్నారు. నేలకొండపల్లి పీఎస్సార్ సెంటర్లో శుక్రవారం చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. తాగు నీటితో పాటుగా త్వరలోనే చలివేంద్రం వద్ద ప్రజలకు దద్దోజనం అందించటానికి చర్యలు తీసుకుంటామన్నారు.కార్యక్రమంలో ఓరుగంటి నారాయణరావు, దోసపాటి రామయ్య, గెల్లా కృష్ణారావు, గెల్లా శ్రీనివాసరావు, కొత్తా కరుణ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ నుంచి ప్రజల ప్రాణాలు కాపాడాలి

ఖమ్మంసంక్షేమవిభాగం,ఏప్రిల్26:ప్రజల ప్రాణాలను వడదెబ్బ ప్రభావం నుంచి కాపాడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మం రేవంతిసెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్మికులు, హమాలీలు, చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లుకు ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

పీఆర్సీ కమిటీకి విశ్రాంత ఉద్యోగుల ప్రతిపాదనలు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్26: 2023జూలై నాటికి పెండింగ్‌లోని 3డీఏలు కలిపి 40శాతం ఫిట్‌మెంట్‌కు తగ్గకుండా రాష్ట్రప్రభుత్వానికి సిఫార్సు చేయాలని తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షప్రధాన కార్యదర్శులు కేశవరెడ్డి, బద్రుద్దీన్‌లు రాష్ట్ర బాధ్యులను కోరారు. పెరుగుతున్న ధరలు, విద్య, వైద్యం వంటి ఇతర ఖర్చులను దృష్టిలో పెట్టుకుని 2023జూలై నుంచి అమలు కావాల్సిన పీఆర్సీ ఫిట్‌మెంట్‌ను ప్రస్తుతం ఉన్న డీఏకు కలపాల్సి ఉందన్నారు. శుక్రవారం స్థానిక సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

అన్నారుగూడెంలో కబడ్డీ పోటీలు ప్రారంభం

తల్లాడ, ఏప్రిల్26: మండల పరిధిలోని అన్నారుగూడెంలో అంకమ్మ తిరునాళ్ల సందర్భంగా జరుగుతున్న ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలస్థాయి కబడ్డీ పోటీలను శుక్రవారం ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు ప్రారంభించారు. గ్రామీణ క్రీడల్లో రారాజైన కబడ్డీ పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోసూరి వెంకటనర్సింహారావు, టీడీపీ మండల నాయకుడు దుగ్గినేని వెంకటేశ్వర్లు, ఆలయకమిటీ సభ్యులు దొడ్డా చిన్న శ్రీనివాసరావు, దుగ్గినేని సత్యనారాయణ, తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, సుంకర రాజారావు, నున్నా చిన్నతిరుమలరావు, రాయపాటి నర్సింహారావు పాల్గొన్నారు.

గోశాలకు పశుగ్రాసం వితరణ

ఖమ్మంసంక్షేమవిభాగం,ఏప్రిల్ 26: సత్తుపల్లికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చల్లగుండ్ల నర్సింహారావు ఖమ్మంలోని గొల్లగూడెం గోశాలకు 10 ట్రాక్టర్లు పశుగ్రాసం వితరణ చేశారు. శుక్రవారం సత్తుపల్లి నుంచి వచ్చిన పశుగ్రాసాన్ని కాంగ్రెస్ జిల్లా నాయకులు తుమ్మల యుగేందర్ సమక్షంలో గోశాల నిర్వాహకులకు అందించారు. పశుగ్రాసాన్నిఅందజేసిన ఆయన్ను అభినందించారు. ఈ కార్యక్రమంలో రమేశ్, రంగారావు, పువ్వాళ్ల ఉమా పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నాయకుడు అంతోటి కన్నుమూత

నేలకొండపల్లి,ఏప్రిల్26:మండల పరిధిలోని బోదులబండ గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు అంతోటి లక్ష్మయ్య(72) శుక్రవారం మృతి చెందారు. కొద్ది రోజులుగా ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కేసుల నుంచి తప్పించుకునేందుకే.. కాంగ్రెస్‌లోకి రౌడీషీటర్లు

- మంత్రి తుమ్మల తిరస్కరించిన నాయకులను ఎలా చేర్చుకుంటారు
- 5వ డివిజన్ కార్పొరేటర్ పల్లెబోయిన



మాట్లాడుతున్న చంద్రం

ఖమ్మంసంక్షేమవిభాగం,ఏప్రిల్26: భూకబ్జాలు చేసి, హత్య కేసులో ముద్దాయిలుగా రౌడీషీట్లు నమోదు జరిగిన నాయకులు కేసుల నుంచి తప్పించు కునేందుకే కాంగ్రెస్‌లో చేరినట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఖమ్మం 5వ డివిజన్ కార్పొరేటర్ పల్లెబోయిన భారతి చంద్రం ఆరోపించారు.శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 5వ డివిజన్‌కు చెందిన బొల్లి రాములు, సర్వేటి వెంకన్న బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చెరేందుకు ప్రయత్నించగా వారిపై ఉన్న కేసుల నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తిరస్కరించారని తెలిపారు. అయితే గురువారం రాత్రి ట్యాంక్ బండ్‌పై ఎన్నికల ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి వద్దకు వెళ్లి కాంగ్రెస్ కండువాలు కప్పుకొని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. నాయకులు నాగేంద్రసింగ్, కొంపెల్లి ధానయ్య, తమ్మిని వెంకటేశ్వరరావు, బంద్ వెంకన్న, విజయ్, కృష్ణవేణి, రామకృష్ణ, సుభాని, యల్లంపల్లి హన్మంతరావు, నామా లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఎన్‌సీసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వరప్రసాద్



వరప్రసాద్‌ను సన్మానిస్తున్న కరుణాకర్

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్26: నేషనల్ క్రిష్టియన్ కౌన్సిల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బేతంపూడి వరప్రసాద్ శుక్రవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా సత్తుపల్లిలోని బైబిల్ మిషన్ ప్రార్థనా మందిరంలో ఆయన్ను ఎన్‌సీసీ జాతీయ పొలిటికల్ వింగ్ అధ్యక్షుడు అలవాల కరుణాకర్ సన్మానించారు. ఈనెల 29న సత్తుపల్లిలో జరిగే క్రిష్టియన్ మైనార్టీ మీటింగ్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రవికిరణ్‌పాల్, ఎన్.యాకోబు, ఏ.శాంసన్, ఎస్.మాథ్యూస్, కే.దేవసహాయం, సీహెచ్.జాన్‌మార్క్, ఈ.దానియేలు, ఈ. దేవసహాయం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠలు



పోలిశెట్టిగూడెంలోని విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న పొంగులేటి, రాఘురామిరెడ్డి



ఎర్రుపాలెంలో విగ్రహాల ప్రతిష్ఠ



కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ మధు, ఇతరులు

ఎర్రుపాలెం, ఏప్రిల్26: మండల కేంద్రంలోని ఎర్రుపాలెంలో దాసాంజనేయస్వామి విగ్రహ, ధ్వజ, శిఖర యంత్రప్రతిష్ఠలను వైభవంగా నిర్వహించారు. గ్రామస్థుల సహకారంతో ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఐదురోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దాసాంజనేయస్వామి విగ్రహంతో పాటు, గణపతి, సుబ్రహ్మణ్యం, ధ్వజ శిఖర యంత్ర, జంట నాగులు విగ్రహాలను ప్రతిష్ఠ నిర్వహించారు. ఎండల నేపథ్యంలో భక్తులకు, తాగునీరు, మజ్జిగలను ఆలయకమిటీ ఏర్పాటు చేసింది. సుమారు 15వేలకు పైగా భక్తుల అన్నప్రసాదాన్ని అందించారు.

బస్వాపురంలో దుర్గమ్మజాతర

కొణిజర్ల: మండలం లింగగూడెం గ్రామ పంచాయతీ బస్వాపురంలోని కనకదుర్గమ్మ జాతరను భక్తులు నిర్వహించారు. అనేక సంవత్సరాలుగా గ్రామంలోని ఆలయం వద్ద గ్రామ ప్రజలు పెద్దఎత్తున ప్రభలు కట్టుకొని వచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. శుక్రవారం అనేమంది మొక్కులు తీర్చుకున్నారు. రెండురోజులు పాటు జాతర జరుగుతుంది. గురువారం రాత్రి ప్రభలు కట్టుకొని భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఎంపీపీ గోసు మధు, గ్రామస్తులు, పెద్దలు, రాజకీయనాయకులు పూజలో పాల్గొన్నారు.

అన్నారుగూడెంలో అన్నదానం

తల్లాడ: మండల పరిధిలోని అన్నారుగూడెంలో అంకమ్మ జాతర సందర్భంగా శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.మూడు రోజులపాటు కార్యక్రమం కొనసాగనుంది. దాతలు తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, అరుణ దంపతులు, ధనుంజయ రావు, లక్ష్మీదంపతులు సహకారాన్ని అందించారు.

పోలిశెట్టిగూడెంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ఖమ్మంరూరల్: మండల పరిధిలోని పోలిశెట్టిగూడెంలో రామాలయంలో విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠామహోత్సవం శుక్రవారం నిర్వహించారు. రెవెన్యూ, గృహనిర్మాణశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రాఘురామిరెడ్డి హాజరయ్యారు.

వైభవంగా గురువమ్మతల్లి కల్యాణం

కారేపల్లి: మండల పరిధిలోని పేరుపల్లిలో గురువారం రాత్రి గురువమ్మతల్లి, గోపయ్యస్వాముల కల్యాణం వైభంగా జరిగింది. పరిసర ప్రాంతాలనుంచి వందలాదా మంది భక్తులు హాజరయ్యారు. గ్రామంలో దేవతమూర్తుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టనాగేశ్వరరావు,వైస్ఎంపీపీ రావూరి శ్రీనివాస్‌రావు, దుగ్గినేని చంద్రం, మల్లెల నాగేశ్వరావు పాల్గొన్నారు.

బస్వాపురంలో కంఠమహేశ్వరస్వామి..

చింతకాని: మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.